WANTED

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లాబ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్/మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

**సంప్రదించాల్సిన నెంబర్లు:**
**9492580091**

facbook.vaaradhinews.com

# వారధి
తెలుగు దిన పత్రిక
www.Vaaradhinews.com

సంపుటి:1
సంచిక:02
గురువారం,
05.09.2024



# ఉప్పొంగుతున్న గోదావరి..!

- భద్రాచలం వద్ద ప్రమాద హెచ్చరిక జారీ
- లోతట్టు ప్రాంతాలకు హై అలర్ట్
- అప్రమత్తంగా ఉండాలన్న పోలీసులు
- వాగులు, వంకలు దాటొద్దని హెచ్చరిక




**వారధి, స్టేట్ బ్యూరో**

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గంట గంటకు పెరుగుతుంది. మూడ్రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. ఓవైపు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండగా మరోవైపు గోదావరి సైతం మెల్లగా తన ప్రతాపాన్ని చూపుతూ పరుగులు పెడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 1.58 గంటలకు గోదావరి నీటి మట్టం 43 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. నీటి మట్టం పెరగడంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి అంచనాలను గమనిస్తూ ముంపు ప్రాంత వాసులను తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. గత నెలలో ఏర్పడిన తుపానుకు భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 53 అడుగులకు చేరింది. దీంతో మూడో ప్రమాద హెచ్చరికను సైతం జారీ చేయాల్సి వచ్చింది. తాజాగా వరద ఉధృతి మెల్లగా పెరుగుతూ మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుంది మరోవైపు అర్థరాత్రి పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో మరింత వరద ప్రవాహం పెరిగే అవకాశం వుంది.

**అప్రమత్తంగా ఉండాలన్న ఎస్పీ**

సెల్ఫీల కోసం వాగులు, వంకలు, నదుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురి కావొద్దని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. వరద నీటితో నిండిపోయిన రోడ్లను దాటడానికి ప్రయత్నించవద్దన్నారు. వర్షాల కారణంగా రోడ్లు బురదమయంగా మారాయని, వాహనాల టైర్లు జారి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. కావున వాహనదారులు నెమ్మదిగా తమ వాహనాలతో ప్రయాణించాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి నది పెరుగుతుండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయిన నేపథ్యంలో పరిసర ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం సూచించిన సూచనలు మేరకు ఎప్పటికప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా ప్రమాదం ఎదురైతే వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు వారి సహాయ సహకారాలు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రజల రక్షణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు విధించిన ఆంక్షలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



# మళ్లీ వాన గండం

- బంగాళాఖాతంలో మరో అల్పపీడనం
- మూడు రోజులు భారీ వర్షా లు
- వాతావరణ శాఖ హెచ్చరిక
- రాత్రి పలు జిల్లాల్లో భారీ వర్షం
- హైదరాబాద్ లో వాగులను తలపించిన రోడ్లు

**వారధి, స్టేట్ బ్యూరో**

తెలుగు రాష్ట్రాలను వరుణుడు వెంటాడుతున్నాడు. ఇప్పటికే భారీ వర్షాలు, వరదలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అతలాకుతలం అయ్యాయి. జన జీవనం స్తంభించింది. ఇది చాలదన్నట్లు మరోమారు తెలుగు రాష్ట్రాలకు వాన గండం పొంచి ఉంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మరోసారి వర్షం బీభత్సం సృష్టించనుందని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అల్పపీడనం, మాన్సూన్ ట్రఫ్ కారణంగా తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు. 6, 7, 8 తేదీల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందన్నారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు వర్షాల ప్రభావం ఉంటుందన్నారు. మరో 5 రోజుల వరకు తెలంగాణ వ్యాప్తంగా కుండపోత వానలు పడొచ్చన్నారు. ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో కుండపోత వానలు కురుస్తాయన్నారు. మంగళవారం రాత్రి రెండు జిల్లాల్లో భారీ వర్షపాతం

2 లో

# మోదీని గద్దె దించుతా



- జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా
- ఇండియా కూటమిని గెలిపించండి
- ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ హామీ

2 లో




# కేసీఆర్ మిస్సింగ్..

- కనబడటం లేదంటూ సిటీలో పోస్టర్లు
- ఎవరు ఏర్పాటు చేశారన్న దానిపై సస్పెన్స్

2 లో

# రైతులకు రేవంత్ గుడ్ న్యూస్

- ఉచితంగా సోలార్ పంపు సెట్లు
- కొండారెడ్డి పల్లెలో పైలెట్ ప్రాజెక్టు
- విద్యుత్ అధికారులతో సమీక్ష

**వారధి, స్టేట్ బ్యూరో**

రైతులకు సోలార్ పంప్ సెట్లను ఉచితంగా అందించి వారిని సోలార్ విద్యుత్ వైపు ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లెను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల్లో వినియోగంలో లేని భూముల్లో

2 లో





# హైడ్రా పేరుతో బెదిరిస్తే జైలుకే..

- బిల్డర్‌ను బెదిరించిన సోషల్ యాక్టివిస్ట్
- రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- రంగనాథ్ నాకు క్లోజ్ అంటూ ఫొటోలు
- హైడ్రా పేరుతో డబ్బులడిగితే జైలుకే
- కమిషనర్ రంగనాథ్ వార్నింగ్
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**వారధి, స్టేట్ బ్యూరో**

హైడ్రా పేరుతో ఎవరైనా బెదిరిస్తే జైలుకు పంపుతామని కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సామాజిక కార్యకర్తలుగా చెలామణి అవుతున్న కొందరు బిల్డర్లను బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. హైడ్రాలో తమకు ఉన్నతాధికారులతో పరిచయాలున్నాయని బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు. హైడ్రాను నీరుగార్చే ప్రయత్నాలపై కొరడా ఝుళిపిస్తామని చెప్పారు. బిల్డర్లను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. హైడ్రా పేరుతో కానీ, తన పేరుతో గానీ ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేసినా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఏసీబీ అధికారులకూ కంప్లయింట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఓ నిర్మాణ

2 లో



# మావోయిస్ట్ అగ్రనేత జగన్ ఎన్‌కౌంటర్

- ధృవీకరించిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- ఆయనపై రూ.25 లక్షల రివార్డు
- మొత్తం ఎన్‌కౌంటర్ లో 9మంది మృతి

**వారధి, స్టేట్ బ్యూరో:** మావోయిస్ట్ అగ్రనేత, మొదటి తరం నాయకుడు మాచర్ల ఏసోబ్ అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ మృతి చెందినట్టుగా పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర కమిటీ సభ్యుడుగా, సెంట్రల్ ఆర్మీ ఇంచార్జ్‌గా, మహారాష్ట్రఛత్తీస్‌గఢ్ సరిహద్దు ఇంఛార్జ్‌గా ఉన్న ఆయన మృతి చెందినట్లు సమాచారం. ఏసోబ్ హనుమకొండ జిల్లా టేకులగూడెం వాసి అని ఛత్తీస్‌గఢ్ పోలీస్ అధికారులు చెబుతున్నట్టు సమాచారం. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతడు మృతి

2 లో

# వరద బాధితులకు బీఆర్ఎస్ సాయం

- ఎమ్మెల్యేల, ఎంపీల ఒక నెల జీతం విరాళం
- బాధితులను చూస్తే కళ్లలో కన్నీళ్లు ఆగలేదు
- అందరూ సాయం చేయండి
- మాజీ మంత్రి హరీశ్ రావు



**వారధి, స్టేట్ బ్యూరో**

ఖమ్మం వరద బాధితులకు సాయం అందించేలా కేసీఆర్ ఆదేశాల మేరకు తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక నెల జీతాన్ని విరాళంగా ఇస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన, బీఆర్ఎస్ ప్రతినిధులు ఒక నెల జీతం విరాళంగా ప్రకటించారు. ఖమ్మం వరదలపై కేసీఆర్ విచారం వ్యక్తం చేశారని, బాధితులకు సాయం అందించాలని ఆయన ఆదేశించారని తెలిపారు. నిత్యావసర సరుకులను గురువారం సిద్దిపేట నుంచి ఖమ్మం వరద బాధితుల ఇంటింటికి అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఖమ్మంలో వరదలు వచ్చాయని వివరించారు. తాను ఖమ్మం వెళ్లి వరద బాధితులను పరామర్శించానని చెప్పారు. వారిని చూస్తే తన కళ్లలో కన్నీళ్లు వచ్చాయని తెలిపారు. వరద బాధితులకు సహాయం చేయడానికి అందరు ముందుకు

2 లో

# మోదీని గద్దె దించుతా



జమ్ముకశ్మీర్‌లోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో (సెప్టెంబరు 18న తొలి విడత, సెప్టెంబరు 25న రెండో విడత, అక్టోబరు 1న మూడో విడత) పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబరు 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

**వారధి, నేషనల్ బ్యూరో**

జమ్ముకశ్మీర్‌లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కృషిచేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. జమ్ములోని రాంబన్ జిల్లా బనిహాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదాను బీజేపీ లాగేసుకుందని విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న రాహుల్, ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచుతామని తెలిపారు. ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరిస్తామన్న ఆయన పాలనలో మిత్రపక్షాలను కలుపుకుని ముందుకుసాగుతామని పేర్కొన్నారు.అధికారంలోకి వచ్చాక జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు మొదటి అడుగు వేస్తాం. ఎన్నికలకు ముందే మీకు రాష్ట్ర హోదా రావాలని మేం కోరుకున్నాం. రాష్ట్ర హోదా వచ్చిన తర్వాత ఎన్నికలు జరగాలని భావించాం. కానీ బీజేపీ అలా అనుకోవడం లేదు. మొదట ఎన్నికలు, తర్వాత రాష్ట్ర హోదా అంశం ఆలోచిద్దాం అని బీజేపీ అనుకుంటోంది. ఏదీ ఏమైనా సరే జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను మేం సాధిస్తాం. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాల్సిందేనని ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతుందని రాహుల్ గాంధీ అన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీలో విశ్వాసం సన్నగిల్లిందని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో పాటుగా వారి కార్పొరేట్ మిత్రులు నడుపుతున్నారని ఆరోపించారు. మోదీ కార్పొరేట్ మిత్రులైన అదానీ, అంబానీల పేర్లను లోక్‌సభలో వాడకూడదని అన్నారని గుర్తుచేశారు. మోదీ, షా, అంబానీ, అదానీ ఈ నాలుగు శక్తులే ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని ఆరోపించారు. బిలియనీర్లకు లబ్ధి చేకూర్చడం కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేశారని మండిపడ్డారు. అనంతరం జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదాతో దోచుకున్నారని రాహుల్ విమర్శించారు. మేము కులగణన కోసం డిమాండ్ చేస్తే, మోదీ కులాల వారీగా జనాభా గణన జరగదని చెప్పారు. ఇండియా కూటమి పట్టుబట్టింది. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ సైతం కులగణనను సమర్థించింది. లేటరల్ ఎంట్రీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాం. దీంతో మోదీ భయపడ్డారు. మొన్నటి ఎన్నికల్లో మోదీ ఛాతీ విశాలంగా ఉండేది. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. దీంతో మోదీని సైకలాజికల్‌గా ఫినిష్ చేశాం. త్వరలోనే మోదీని, బీజేపీని ప్రభుత్వాన్ని గద్దె దించుతాం అని రాహుల్ గాంధీ తెలిపారు.



## మాజీ మంత్రి వ్యాఖ్యలు అర్ధరహితం

- **మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్**

**వారధి న్యూస్, వనపర్తి:** భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, ప్రభుత్వ అధికారులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారని, కానీ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈ ఆపద సమయంలో రాజకీయ విమర్శలు చేస్తున్నారని వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మహేష్ మాట్లాడారు.వనపర్తి కాంగ్రెస్ సమన్వయకర్త ఎల్ సతీష్ మాట్లాడుతూ ప్రజలకు సహాయంగా నాయకత్వం కొనసాగుతుందని వరదల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తోడుగా నిలిచిందని, కానీ కేసీఆర్ తన హయాంలో ఎప్పుడైనా ఎవరినైనా పరామర్శించారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లాలోని వివిధ నాయకులు, కౌన్సిలర్లు కూడా పాల్గొన్నారు.

## పలుస శంకర్ గౌడ్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

- **వనపర్తి: విద్యారంగంలో మూడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో చేసిన సేవలకు గౌరవం**



**వారధి న్యూస్, వనపర్తి:** యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న పలుస శంకర్ గౌడ్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించినట్లు రాష్ట్ర విద్యా శాఖ పక్షాన సమాచారం అందింది. ఆయనకు ఈ పురస్కారం మూడు దశాబ్దాలకు పైగా విద్యా రంగంలో చేసిన సేవలకు గాను లభించినట్లు తెలుస్తోంది.
హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకర్ గౌడ్ ఈ అవార్డును స్వీకరించనున్నారు. అక్షరదీక్ష, విలువల విద్య, బాల సాహిత్య సభలతో పాటు సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడిగా వివిధ అంశాలకు సంబంధించిన దాదాపు ముప్పై వేల పుస్తకాలను పాఠశాల మరియు శాఖా గ్రంథాలయాలకు అందించిన శంకర్ గౌడ్ సేవలు ప్రశంసనీయమని ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.




## కేసీఆర్ మిస్సింగ్..

**కనబడటం లేదంటూ సిటీలో పోస్టర్లు ఎవరు ఏర్పాటు చేశారన్న దానిపై సస్పెన్స్**

**వారధి, స్టేట్ బ్యూరో**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ 'కనబడుట లేదు' అంటూ హైదరాబాద్ నగరంలో పలు పోస్టర్లు వెలిశాయి. తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్లు అధికారం ఇచ్చిన ప్రజలు వరదల్లో కష్టాలు పడుతుంటే ప్రతిపక్ష నేత కేసీఆర్ పత్తా లేడు అంటూ సదరు పోస్టర్లలో పేర్కొన్నారు. అయితే, ఈ పోస్టర్లు ఎవరు ఏర్పాటు చేశారనేది మాత్రం తెలియరాలేదు. తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. గత రెండు మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. పదుల సంఖ్యలో మృతి చెందగా, వందల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఖమ్మంతోపాటు పలు జిల్లాల్లోనూ భారీ పంట నష్టం జరిగింది. అయినప్పటికీ ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ వరద బాధితులను పరామర్శించేందుకు బయటకు రాకపోవడంపై ఇప్పటికే అధికార పక్షం నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ కనబడుట లేదు అంటూ పోస్టుర్లు ప్రత్యక్షం కావడం కలకలం రేపుతోంది.

## మావోయిస్ట్ అగ్రనేత జగన్ ఎన్‌కౌంటర్


**మొదటిపేజీ తరువాయి భాగం**

చెందాడని దంతేవాడ పోలీసులు చెబుతున్నారు. కాగా ఆయన మరణంపై మావోయిస్ట్ పార్టీ అధికారికంగా ఇంతవరకు ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. మాచర్ల ఏసోబ్ మరణించారంటూ వస్తున్న వార్తలతో ఆయన స్వగ్రామం టేకులగూడెంలో విషాదం అలుముకుంది.

కాగా మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ ప్రాణ నష్టం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబ్‌పై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌తో మొత్తం 9 మంది చనిపోయారు. మృతుల పేరు, రివార్డు వివరాలను పోలీసులు ప్రకటించారు.

1. రణధీర్ (హోదాడీకేఎస్‌జెడ్‌సీఎం), వరంగల్ నివాసి రివార్డ్ రూ.25 లక్షలు.
2. కుమారి శాంతి (హోదా 31 పీఎల్ సభ్యుడు) రివార్డు రూ.5 లక్షలు.
3. సుశీల మడకం, భర్త జగదీష్ (హోదా ఏసీఎం) రివార్డ్ రూ.5 లక్షలు.
4. గంగి ముచకి (హోదా కాటేకల్యాణ్ ఏరియా కమిటీ సభ్యుడు) రివార్డ్ రూ.5 లక్షలు
5. కోసా మాద్వి (హోదా మలంగిర్ ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు) రివార్డ్ రూ.5 లక్షలు.
6. లలిత (హోదా డీవీసీఎం సురక్షా దళ్ సభ్యుడు) రివార్డ్ రూ.5 లక్షలు.
7. కవిత (హోదా గార్డ్ ఆఫ్ ఏవోబీఎస్‌జెడ్‌సీ రివార్డ్ రూ.5 లక్షలు.
8. హిడ్మే మంకం (హోదా డీవీసీఎం సురక్షా దళ్ సభ్యుడు రివార్డ్ రూ.2 లక్షలు.
9. కమలేశ్ (హోదాప్లాటూన్ సభ్యుడు) బీజాపూర్ జిల్లావాసి రివార్డ్ రూ.2 లక్షలు.

కాగా ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చనిపోవడంతో పాటు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో 303 సెల్ఫ్ లోడింగ్ రైపిల్స్, 12 తుపాకులు లభ్యమయ్యాయని పోలీసులు తెలిపారు.



## మళ్లీ వాన గండం

**మొదటిపేజీ తరువాయి భాగం**

నమోదైంది. సిద్ధిపేట జిల్లాలో అత్యధికంగా 17 సెంటీమీటర్లు, నిజామాబాద్ జిల్లాలో 13 సెంటీమీటర్లు, ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 7 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం తెలంగాణలోని రామగుండం నుండి కళింగపట్నం వరకు మాన్ సూన్ ట్రఫ్ కొనసాగుతోంది. కోస్తాంధ్ర తీరంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం.. నేడు అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీని కారణంగా రాష్ట్రంలో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు.

**రాత్రి హైదరాబాద్ లో భారీ వర్షం**

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రాత్రి నగరంలో భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటల వరకు ఆగకుండా కురుస్తూనే ఉంది. కుంభవృష్టి కారణంగా నగరంలోని రోడ్లన్నీ వాగులను తలపించాయి. మరోవైపు పలు జిల్లాల్లోనూ అర్ధరాత్రి భారీ వానలు పడ్డాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.



## కాంగ్రెస్‌లోకి రెజ్లర్లు

**వారధి, నేషనల్ బ్యూరో**

రెజ్లర్లు వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిశారు. హర్యానా ఎన్నికల సమయంలో వినేష్, పునియా కాంగ్రెస్‌లో చేరడం కీలక పరిణామం అని రాహుల్ గాంధీ అన్నారు . అక్టోబర్‌లో హర్యానా అసెంబ్లీ ఎన్నికల జరుగనున్న క్రమంలో కాంగ్రెస్ బుధవారం కాంగ్రెస్ ఎన్నికల సంఘం సమావేశమయ్యింది. ఈ సమావేవంలో వినేష్ ఫోగట్‌ను కాంగ్రెస్ తరపున హర్యానాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో దేనికైనా పోటీ చేయడానికి కాంగ్రెస్ ఆఫర్ చేరసింది. చర్కీదాద్రి, బద్ధా, జులనా నియోజ కవర్గాల నుంచి దేనికైనా పోటీ చేసేందుకు వినేష్ ఫోగట్ కు ఆఫర్ ఇచ్చారు. చర్కీ దాద్రీ వినేష్ ఫోగట్ సొంత జిల్లా.., ఆమె సొంత గ్రామం బలాలీ.. బద్దాడా అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంది. ఇక ఆమె అత్తమామల ఇల్లు జులనాలో ఉంది.. దీంతో కాంగ్రెస్ ఈ మూడు నియోజకవర్గాలనుంచి వినేష్ ఫోగట్‌కు పోటీ చేయాలని కోరారు. మరోవైపు బజరంగ్ పునియా కూడా కాంగ్రెస్ ఆఫర్ ఇచ్చింది. బహదూర్‌ఘర్ లేదా భివానీ నుంచి రాబోయే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఈ రెండు స్థానాలు జాట్ ల ప్రాబల్యం ప్రాంతాలు. అయితే బద్లీ , రఖజ్జర్ లోని సోనిపట్ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని బజరంగ్ పునియా చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు బలంగా ఉన్నారు. బద్లీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కులదీప్ వత్స్.. హర్యానా కాంగ్రెస్ ప్రముఖులలో ఒకరు.. దీంతో ఆయన టికెట్ రద్దు చేయడం కాంగ్రెస్ కు ఇష్టం లేదు. సోనిపట్ లోని ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేంద్ర పర్వాన్ ఓ కేసులో జైలులో ఉన్నారు. ఆ స్థానం నుంచి అతని కుటుంబ సభ్యులలో ఒకరికి టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు బజరంగ్ పునియా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదని తెలుస్తోంది.



## వరద బాధితులకు బీఆర్ఎస్ సాయం

**మొదటిపేజీ తరువాయి భాగం**

రావాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేటలో అమర్నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులకు మట్టి వినాయకుని పంపిణీ చేశారు. చెరువులను కాపాడడం మన అందరి బాధ్యత అని, మట్టి వినాయకులను పూజిద్దామని చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్తో చెరువులో చేపలు చనిపోతున్నవి, పర్యావరణం, చెరువులను కాపాడుకుందామని ఆయన వ్యాఖ్యానించారు.

## అపరాజిత బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఆమోదం

**వారధి, నేషనల్ బ్యూరో**


అపరాజిత వుమెన్ అండ్ చైల్డ్ (వెస్ట్ బెంగాల్ క్రిమినల్ లాస్ ఎమెండ్‌మెంట్) బిల్లు 2024ను పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మంగళవారం వాయిస్ ఓటుతో ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ లైంగికదాడుల వ్యతిరేక బిల్లును రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి మోలోరు ఘటక్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'చారిత్రాత్మకంగా' అభివర్ణించారు. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ 'బిల్లుపై సంతకం చేయాలని గవర్నర్‌ను కోరాలని' బీజేపీ ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. మానవాళికి లైంగికదాడి ఒక శాపమని, ఇలాంటి నేరాలను నిరోధించేందుకు సామాజికి సంస్కరణలు అవసరమని మమతా తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందిన తరువాత గడువులోగా విచారణను పూర్తి చేసేందుకు స్పెషల్ అపరాజిత టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. 'ఇది చారిత్రాత్మకమైన, ఆదర్శమైన బిల్లు. మంచి ఉద్దేశ్యం ఉన్న ఎవరైనా ఈ బిల్లుకు మద్దతు ఇస్తారు' అని అన్నారు.కాగా, ఈ బిల్లు ప్రకారం లైంగికదాడి తరువాత లేదా లైంగికదాడికి పాల్పడిన వారి చర్యల ద్వారా బాధిత మహిళ మరణించినా, మళ్లీ కొలుకోలేని స్థితిలో మహిళ ఉన్నా దోషులకు మరణశిక్ష విధిస్తారు. కొల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన నేపథ్యంలో ఈ బిల్లును బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చింది. కొల్‌కతా కేసును రాష్ట్ర పోలీసులు ఛేదించలేకపోతే సిబిఐకి అప్పగిస్తామని ఆ రోజునే మృతురాలి కుటుంబానికి చెప్పానని, ఇప్పుడు సిబిఐ నుంచి తమకు న్యాయం జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి చెప్పారు.ఈ బిల్లుకు ప్రతిపక్ష నాయకులు సువేందు అధికారి, ఎమ్మెల్యేలు కూడా పూర్తి మద్దతు ఇచ్చారు.



## రైతులకు రేవంత్ గుడ్ న్యూస్

**మొదటిపేజీ తరువాయి భాగం**

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సోలాట్ పంప్ సెట్ల ద్వారా వచ్చే మిగులు విద్యుత్ పై రైతుకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సోలార్ విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. వంటగ్యాస్ బదులుగా సోలార్ సిలిండర్ విధానాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వీటిపై మహిళా సంఘాలకు శిక్షణ అందించి వారిని సోలార్ సిలిండర్ బిజినెస్ వైపు ప్రోత్సహించాలని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అటవీ భూముల్లోనూ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ ఏటా 40వేల మెగావాట్స్ విద్యుత్ అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టాలని, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి దుబారాను తగ్గించాలన్నారు. ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండొద్దని, వినియోగదారులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్న నమ్మకం కలిగించేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ బిజినెస్ హబ్ గా మారబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన సూచనలు చేశారు. ఐటీ, ఇండస్ట్రియల్ శాఖలతో సమన్వయం చేసుకుని యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని చెప్పారు.



## హైడ్రా పేరుతో బెదిరిస్తే జైలుకే..

**మొదటిపేజీ తరువాయి భాగం**

సంస్థ బిల్డింగ్ కన్ స్ట్రక్షన్ స్టార్ట్ చేసింది. తాను సోషల్ యాక్టివిస్ట్, సోషల్ వర్కర్ అని ప్రచారం చేసుకుంటూ బండ్ల విప్లవ్ సిన్హా అనే వ్యక్తి సదరు బిల్డర్ ను బెదిరించారు. నిర్మాణ పనులు చూసేందుకు వస్తున్న కస్టమర్లకు అసత్య ప్రచారం చేస్తున్నాడు. తనకు రూ. 20 లక్షలు ఇవ్వాలని లేకుంటే హైడ్రాకు ఫిర్యాదు చేస్తానని, పత్రికల్లో రాయిస్తానని పిస్తా హౌస్ వద్ద కలుద్దామని చెప్పి పిలిపించాడు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తో తనకు క్లోజ్ ఫ్రెండ్షిప్ ఉందని చెప్పి కలిసి దిగిన ఫోటోలు చూపించాడు. అమీన్ పూర్ ఏరియాలో ఎలాంటి విషయమైనా రంగనాథ్ తననే అడుగుతారని, తనకు డబ్బు ఇవ్వకుంటే మీ నిర్మాణాలను కూల్చేయిస్తానని, పత్రికల్లో తప్పుగా రాయిస్తానని బెదిరించాడు. హైడ్రా పేరిట బెదిరింపులకు పాల్పడుతున్న డాక్టర్ బండ్ల విప్లవ సిన్హా పై బిల్డర్లు వాడల రాజేంద్రనాథ్, మంజునాథ్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విప్లవ్ ను పోలీసులు అరెస్టు చేశారు.

# ముంపు బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం: సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

**వారధి న్యూస్, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో అధిక వర్షాల వలన ముంపుకు గురైన బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన అక్కెనపల్లిలో ఉన్న తాత్కాలిక శిబిరాలను సందర్శించి, 23 కుటుంబాల 53 మంది బాధితులతో మాట్లాడారు. కలెక్టర్, పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధతో కలిసి బాధితులకు శాశ్వత గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, వైద్య సదుపాయాలు, ఆహారం అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

'వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిశీలన: కోహెడ మండలంలో అధిక వర్షాల వల్ల చెరువుల నీరు ప్రవహించి ఇళ్లలోకి చేరడంతో కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధ స్థానిక పరిస్థితులను పరిశీలించారు. చెరువుల బ్యాక్ వాటర్ వల్ల దెబ్బతిన్న ఇండ్ల వివరాలను సేకరించి, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పిచ్చి మొక్కలను తొలగించడం, వ్యాధుల నివారణకు సానిటేషన్ పనులు పటిష్టంగా నిర్వహించాలని కూడా ఆదేశించారు.





## డబల్ బెడ్ రూమ్ ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి: డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

**★హైదరాబాద్:★** కోల్లుర్ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి సూచించారు. కొల్లూర్ ప్రాంతంలో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో కొందరు మోసగాళ్లు ఫోన్ కాల్స్ చేస్తున్నారని సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ప్రజలు మరియు లబ్ధిదారులు ఇలాంటి ఫోన్ కాల్స్‌కు బలవకూడదని, ఎలాంటి అనుమానాస్పద సమాచారాన్ని నమ్మకూడదని ఆమె హెచ్చరించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన అన్ని విషయాలను అధికారిక వేదికల ద్వారా మాత్రమే తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఇలాంటి మోసపూరిత చర్యల గురించి తెలియజేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) విజ్ఞప్తి చేసింది.



## క్రిటికల్ కేర్ యూనిట్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

**: కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వారధి న్యూస్, వనపర్తి బ్యూరో:** నర్సింగాయపల్లి ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను డిసెంబర్ చివరినాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రూ. 23.75 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఈ యూనిట్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.బుధవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి నర్సింగాయపల్లి ఆసుపత్రి ప్రాంగణాన్ని సందర్శించారు. ఆసుపత్రి పరిసరాల్లో నిలువ నీరు సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిం.టి. స్కాన్ వంటి సేవలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, టి.జి.యం.ఐ.డి.సి. ఇంజనీరు జైపాల్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ భవన్ పనులు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జెండగే

**వారధి న్యూస్, భువనగిరి:** భువనగిరి సింగన్న గూడెంలో నిర్మాణం పూర్తి కావస్తున్న అంబేద్కర్ భవన్ పనులు ఈనెల చివరికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జెండగే పంచాయితీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. బుధవారం ఆయన భవన్‌ను సందర్శించి, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు, డ్రైనేజీ సిస్టం ఏర్పాటుపై సూచనలు చేశారు. ఇంకా మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేసి, ఈనెల చివరి వరకు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పంచాయితీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటేశర్లును ఆదేశించారు.ఈ సందర్భనలో పంచాయితీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గిరిధర్, మున్సిపల్ కమిషనర్ రామాంజులురెడ్డి, పంచాయితీరాజ్ డివిజనల్ ఇంజనీరు సుదర్శనరెడ్డి, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## మృతుని పార్థివ దేహానికి ఘన నివాళులు అర్పించిన నేతలు

**★వారధి న్యూస్, కొత్తకోట:★** కొత్తకోట మున్సిపాలిటీ 3వ వార్డుకు చెందిన దేశీ నెల్లూరు నాగన్న యాదవ్ (77) మృతి చెందగా, అతని పార్థివ దేహానికి మాజీ జడ్పీటీసీ పొగాకు విశ్వేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బీసం జయమ్మ, కౌన్సిలర్లు రాములు యాదవ్, ఖాజా మైనోద్దిన్, కో ఆప్షన్ సభ్యులు వసీం ఖాన్, మాజీ ఎంపిటిసి తిమ్మన్న యాదవ్, సిమెంట్ రాములు యాదవ్, హమాలీ యాదయ్యలు పూలమాలతో ఘన నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



## జిట్టా బాలకృష్ణారెడ్డి ఆరోగ్యం కోసం పాదయాత్ర

**వారధి న్యూస్, భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ బుధవారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, స్థానిక మార్కండేశ్వర స్వామి దేవాలయం నుండి బీబీనగర్ మండలంలోని పడమటి సోమారం గ్రామంలోని లింగ బసవేశ్వర స్వామి దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, జిట్టా బాలకృష్ణారెడ్డి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో చేసిన అపార కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, నోముల మాధవ రెడ్డి, మరియు అనేక నాయకులు పాల్గొన్నారు.




## ఆమరణ నిరాహారదీక్షలో బత్తుల సిద్ధేశ్వర్ ఆరోగ్యం క్షీణిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

**కూకట్ పల్లి, వారధి న్యూస్:** బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని గాంధీ హాస్పిటల్ లో గత పది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్ధేశ్వర్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. ఈ నేపథ్యంలో, బీసీ రాష్ట్ర నాయకులు పర్వత సతీష్ కుమార్ పటేల్, పుట్టం పురుషోత్తం రావు పటేల్, తదితరులు సిద్ధేశ్వర్‌ను పరామర్శించారు. వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిందని విమర్శించారు.బత్తుల సిద్ధేశ్వర్ దీక్షను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలం వెళ్లదీస్తోందని, ఆయన ఆరోగ్యం క్షీణించిన ఈ పరిస్థితిలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి దీక్ష విరమింప చేయాలని పటేల్ సూచించారు. ఈ కార్యక్రమంలో రాజారాం యాదవ్, అవుల రామారావు, జాజుల శ్రీనివాస్ గౌడ్, యంపీపి మల్లన్న, నరహరి, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## సింగారం గ్రామ అభివృద్ధి పై ఎంఎల్ఏ రాజగోపాల్ రెడ్డి హామీ

**మునుగోడు, వారధి న్యూస్:** మునుగోడు మండలం లోని సింగారం గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని సమస్యలు మరియు చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. దానికి స్పందించిన ఎంఎల్ఏ, సింగారం గ్రామ అభివృద్ధి కోసం దశల వారీగా నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.ఎంఎల్ఏ రాజగోపాల్ రెడ్డి, సింగారం వాగు నుండి నేరటోనిగూడెం మీదుగా కచలాపురం గ్రామం వరకు బిటి రోడ్డు నిర్మాణానికి 2.40 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ వెల్లం రిజర్వాయర్ పనులు కూడా త్వరలోనే పూర్తి చేయించి, రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు కోడి చంద్రయ్య, పోగుల జానకిప్రకాశ్, ఉప్పునూతల రమేష్, తదితరులు పాల్గొని ఎంఎల్ఏకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## గుజ్జుల కృష్ణయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వారధి న్యూస్, పెబ్బేరు:** గుమ్మడం గ్రామానికి చెందిన గ్రామీణ వికాస్ బ్యాంకు ఉద్యోగి గుజ్జుల కృష్ణయ్య అనారోగ్యంతో మరణించిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల కారణంగా దాహన సంస్కారాలకు హాజరుకాలేకపోయిన చిన్నారెడ్డి గారు, ఈరోజు దశదినకర్మకు హాజరై కృష్ణయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్, పి.ఎ. భాస్కర్, పాతపల్లి చంద్రశేఖర్, గడ్డం వినోద్, గుమ్మడం కాంగ్రెస్ పార్టీ నాయకులు హరిబాబు, కృష్ణయ్య, శ్రీను, మాజీ సర్పంచ్ పాపన్న రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాల వలన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

- **తెలంగాణ రైతు సంఘం నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసులు డిమాండ్***

**వారధి న్యూస్, నాగర్‌కర్నూల్:**తాజా భారీ వర్షాల కారణంగా నాగర్ కర్నూల్ జిల్లాలో పంటలు తీవ్రంగా నష్టపోయాయని, నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాల్సిన అవసరమని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

బుధవారం, నాగర్ కర్నూల్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో పత్తి పంటకు తీసిన ఈదురుగాల కారణంగా నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించిన అనంతరం, ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా నాగర్ కర్నూల్ జిల్లాలో మొక్కజొన్న, వరి, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా నష్టపోయాయని తెలిపారు. పత్తి చేలల్లో నీళ్లతో నిండి, పంటలపై విపరీతమైన నష్టం సంభవించిందని పేర్కొన్నారు.

ఆయన, రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ జాయింట్ సర్వే నిర్వహించి, జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలని, ప్రతి రైతుకు ఆహార పంటలకు ఎకరాకు 25 వేల రూపాయలు, వాణిజ్య పంటలకు ఎకరాకు 50 వేల రూపాయలు, పశువులు చనిపోతే ఒక్కో పశువుకు 50 వేల రూపాయలు, గొర్రెలు, మేకలు చనిపోతే 10 వేల రూపాయలు పరిహారం అందించాలన్నారు.

మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకంలోని కాలువలు తెగిపోయి, పంట చెట్లలో మట్టి ఇసుక మేటలు వేసిన విషయం దృష్ట్యా, వాటిని తొలగించేందుకు ఎకరాకు 50,000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, బిజినపల్లి, అచ్చంపేట మండలాల్లో కాలువలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేసి, రైతులకు సాగునీరు అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి నాగరాజు గౌడు, జిల్లా కమిటీ సభ్యులు వి వెంకటేష్, రైతులు ఆడాల వెంకటయ్య, వీ శేఖర్, బాల చంద్రయ్య, సి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com


# కేశవాపురం వెలుగుపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి కృషి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్



**వారధి న్యూస్ ,తుంగతుర్తి:** గడచిన నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తుంగతుర్తి నియోజకవర్గంలో అనేక ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఈ వరదల కారణంగా కొన్ని గ్రామాలకు రాకపోకలు బంద్ కాగా, మానాయకుంట వద్ద ఒక మహిళ వరదలలో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.

బుధవారం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ కేశవాపురం గ్రామానికి సమీపంలో ప్రవహిస్తున్న కేశవాపురం బంధాన్ని పరిశీలించి, అక్కడి పరిస్థితులపై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ, కేశవాపురం గ్రామానికి ఇతర గ్రామాలతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని, ఈ గ్రామంలో సుమారు 1500 మంది ప్రజలు చిక్కుకుపోయారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారం కోసం వెలుగుపల్లి నుండి కేశవాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఇరిగేషన్ శాఖ మాత్యులు ఉత్తంకుమార్ రెడ్డిలకు విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు.ఇదే సందర్భంలో, మండలంలోని అరవపెల్లి గ్రామంలో రెసిడెన్షియల్ పాఠశాలలు చెరువులో నిర్మించడం వల్ల పాఠశాలలోకి నీరు వచ్చి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, మానాయకుంట వద్ద మహిళ వరదలో మృతి చెందిన ఘటన అత్యంత విచారకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరదల ప్రభావం గల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అధికారులు ఎప్పటికప్పుడు సహాయం అందించాలని, ప్రమాద భరితమైన చెరువులను పరిశీలించి లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారికి రక్షణ కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కంట్లమయ్య, పిసిసి మెంబర్ గుడిపాటి నరసయ్య, మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు తిరుమల ప్రగడ కిషన్ రావు, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు లతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## బి.సి. బాలుర వసతి గృహం భవన మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వారధి న్యూస్, వనపర్తి జిల్లా:** వనపర్తి జిల్లాలోని నాగవరంలో ఉన్న ప్రభుత్వ బి.సి. బాలుర వసతి గృహాన్ని మరో భవనంలో మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బి.సి. సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా వసతి గృహాన్ని సందర్శించి, ఇటీవల కురిసిన వర్షాలకు భవనం కారడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించారు. తాత్కాలిక ఏర్పాట్లను చూసి, భవనం మార్పు కోసం త్వరగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## పేదింటి పెళ్లికి పెద్దదిక్కుగా ప్రజా ప్రభుత్వం

- పేదలకు ఆరోగ్య రక్షణతో సీఎం రిలీఫ్ ఫండ్
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**వారధి న్యూస్,ఇబ్రహీంపట్నం:** పేదల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందిస్తూ, ప్రజా ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాధీ ముబారక్ పథకాలతో పాటు, పేదలకు ఆరోగ్య రక్షణ అందించే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కీలక పాత్ర పోషిస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం, ఇబ్రహీంపట్నం శాస్త్ర గార్డెన్స్ లో, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మరియు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, అధిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని 359 మంది లబ్ధిదారులకు సుమారు 3.74 కోట్ల రూపాయల విలువైన కళ్యాణలక్ష్మి మరియు షాధీ ముబారక్ చెక్కులను, 113 మంది లబ్ధిదారులకు సుమారు 28.66 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సింగల్ విండో చైర్మన్లు, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సరైన నంబర్ ప్లేట్లు లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం: ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు

**వారధి న్యూస్, గద్వాల్ :** వాహనాల నెంబర్ ప్లేట్ లు సరిగ్గా లేని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు హెచ్చరించారు. బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గద్వాల్ సీఐ కార్యాలయ పరిధిలో వాహనాలపై తనిఖీ చేపట్టిన ఆయన, సరైన పత్రాలు లేని, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి అపరాధ రుసుము విధించారు. మైనర్ల వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, జరిమానా విధించారు. సరైన నంబర్ ప్లేట్లు మరియు పత్రాలు లేని పలు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా, వాహనదారులు నెంబర్ ప్లేట్లు ట్యాంపరింగ్ చేస్తున్నారని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వడం, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడంలాంటి వాహనాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. వర్షాకాలంలో హెల్మెట్ ధరించి, అప్రమత్తంగా వాహనాలను నడపాలని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది రమేష్, సుధాకర్, విష్ణు, తిమ్మప్ప, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



## సీతారాం నాయక్ కు నివాళులర్పించిన కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్ రెడ్డి

**వారధి న్యూస్, పెంట్లవెల్లి:** కొల్లాపూర్ నియోజకవర్గం మరియు మండల పరిధిలోని సున్నపు తండా కు చెందిన గిరిజన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సాయంత్రం పొలం దగ్గర విద్యుత్తు ప్రమాదంలో మరణించారు. ఈ విషాదకర సంఘటన తెలిసిన కొల్లాపూర్ నియోజక వర్గ బీఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు భీరం హర్షవర్ధన్ రెడ్డి, సీతారాం నాయక్ సర్వస్వం నివాసం అయిన సున్నపు తండా వెళ్లి వారి పార్థివ దేహానికి పూలమాల అర్పించి నివాళులర్పించారు.మాజీ ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, సీతారాం నాయక్ లాంటి మంచి మనిషి మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. ఆయన ఎప్పుడూ ప్రజా సేవ కోసం, గ్రామ ప్రజల మేలు కోసం కృషి చేస్తూ, గిరిజన సోదరుల అభ్యున్నతి కోసం పాటుపడేవారు అన్నారు. అంతిమ యాత్రలో పాల్గొని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించిన ఆయన, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు మరియు తండా వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలి

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** ఒకే రకమైన పంట సాగు చెయ్యకుండా రైతులు అధిక ఆదాయం వచ్చే ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ మండల పరిధిలోని గన్యాగుల గ్రామంలో ఎద్దుల నరసింహారెడ్డి రైతు తన 18 ఎకరాల పొలంలో సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ సాగును కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగు వివరాలు, లాభాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ లాభాలు ఆర్జించేందుకు అవకాశముందని అన్నారు. పంట కాపునకు వచ్చిన తరువాత ఏడాదిలో ఎకరానికి లక్ష వరకు లాభం రానుందని తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తరువాత నాలుగో సంవత్సరం నుంచి దిగుబడులు ప్రారంభం అవుతాయని, 30సంవత్సరాల వరకు ఈ మొక్క దిగుబడి ఇస్తూ రైతులకు ఆదాయాన్ని ఆర్జించి పెడుతుందన్నారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తోందన్నారు. ఆయిల్ పామ్ వల్ల కలిగే లాభాలు గురించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఆసక్తి అనుకూల పరిస్థితులు కలిగి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేలా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ పంట దిగుబడిని మార్కెటింగ్ చేయడం కూడా ఎంతో సులభమని, ముందస్తుగానే ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు వచ్చి నిర్ణీత మద్దతు ధరకు కొనుగోలు చేసి తీసుకెళ్తాయన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టిసారించేలా చూడాలని ఉద్యాన శాఖ అధికారులకు సూచించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జగన్, నాగర్ కర్నూల్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, కొల్లాపూర్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి లక్ష్మణ్, నాగర్ కర్నూల్ ఎంపీడీవో కోటేశ్వర్, రైతులు తదితరులు ఉన్నారు.





## రిజర్వ్ బ్యాంక్ 90 సంవత్సరాల వేడుకల సందర్భంగా క్విజ్ పోటీలు

- జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ అయ్యపు రెడ్డి

**వారధి న్యూస్, గద్వాల జిల్లా:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేకంగా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ అయ్యపు రెడ్డి ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారి వయస్సు 25 సంవత్సరాల లోపు ఉండాలని, పోటీలు నాలుగు దశలలో నిర్వహించబడతాయని తెలిపారు. మొదటి దశ జిల్లా స్థాయిలో, రెండవ దశ రాష్ట్ర స్థాయిలో, మూడవ దశ జోనల్ స్థాయిలో, నాలుగవ దశ దేశ స్థాయిలో జరగనుంది.క్విజ్ లో పాల్గొనే విద్యార్థులు ఆర్బీఐ పోర్టల్ లో నమోదు చేసుకుని, మొదట జిల్లా స్థాయిలో జరిగే అంతర్జాల పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. మిగిలిన దశలలో విద్యార్థులు స్వయంగా పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఈ పోటీలు ఆంగ్లం మరియు హిందీ భాషలలో నిర్వహించబడతాయి. పోటీ విషయాలు ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర, సాహిత్యం, సైన్స్ & టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ మరియు ఆర్బీఐ డిజిటల్ కరెన్సీకి సంబంధించిన అంశాలను కలిగి ఉంటాయని వివరించారు.ఈ క్విజ్ పోటీలలో ఇద్దరు విద్యార్థులు కలిసి ఒక టీంగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవచ్చని, పరీక్షలు 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఎప్పుడైనా ఎక్కడి నుండైనా రాయవచ్చని తెలిపారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు ప్రైజ్ మనీ ఇవ్వబడుతుంది. జాతీయ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.10 లక్షలు, 2వ బహుమతిగా రూ.8 లక్షలు, 3వ బహుమతిగా రూ.6 లక్షలు, జోనల్ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.5 లక్షలు, 2వ బహుమతిగా రూ.4 లక్షలు, 3వ బహుమతిగా రూ.3 లక్షలు, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతిగా రూ.2 లక్షలు, 2వ బహుమతిగా రూ.1.5 లక్షలు, 3వ బహుమతిగా రూ.1 లక్ష అందజేయనున్నట్లు తెలిపారు.జిల్లా డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ఈ కార్యక్రమంపై దృష్టిపెట్టి, విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేటట్లు చూడాలని అయ్యపు రెడ్డి కోరారు.



## వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ సూచించారు. బుధవారం జిల్లాలోనికొల్లాపూర్ నియోజకవర్గంలో విస్తృత పర్యటన చేశారు.కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు . అనంతరం కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రి సందర్శించి ఆసుపత్రి లోని అన్ని విభాగాలను, రోగులకు సేవలు అందిస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రోగుల వివరాలు వారికి అందుతున్న వైద్య సౌకర్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయి డాక్టర్లు, సిబ్బంది వైద్యం బాగానే చేస్తున్నారా అంటూ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్వయంగా వైద్య చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవల తీరుపై ఆరా తీశారు. కొల్లాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఔట్ పేషెంట్ విభాగాలను, ల్యాబ్, ఐపి వార్డు, ఫార్మసీ, పిడియాట్రిక్ వార్డు, ఐసీయూ, ఎం.ఐ.సీ.యూ. విభాగాలను పరిశీలించి, ప్రతి రోజూ ఎంత మంది పేషెంట్లు వస్తున్నారు? ఎంత మంది జ్వరంతో వస్తున్నారు? ఎంత మందికి పరీక్షలు చేస్తున్నారు? అనే వివరాలను ఆసుపత్రి పర్యవేక్షకులు డా. శ్రీనివాసులు ను అడిగి తెలుసుకున్నారు. వార్డులో జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులతో ఆయన స్వయంగా మాట్లాడి ఆసుపత్రిలో సేవలు ఎలా ఉన్నాయి అనే వివరాలను ఆరా తీశారు. ఎక్కడి నుంచి వచ్చారు. ఆసుపత్రికి వచ్చిన ఎన్ని రోజులు అవుతుంది అని ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. విష జ్వరాలు, డెంగ్యూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్లవేళలా వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అనంతరం రామాపురం లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి డయాలసిస్ పనితీరును పరిశీలించారు. , అదే ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం సోమశిల లో పర్యాటకులకు కావలసిన సౌకర్యాలను పరిశీలించి . మరుగుదొడ్ల నిర్మాణానికి కావలసిన స్థల సేకరణ కొరకు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజ్, తహసిల్దార్, విష్ణువర్ధన్, వైద్యులు తదితరులు వెంట ఉన్నారు .



## సిద్దిపేట అభివృద్ధి కోసం అసెంబ్లీలో పోరాడతా: హరీశ్ రావు

- నిర్విరామ కృషి చేస్తానని హామీ

**వారధి న్యూస్, సిద్దిపేట:** సిద్దిపేట అభివృద్ధిని నిరంతరం కొనసాగిస్తానని, అవసరమైతే అసెంబ్లీలో కూడా పోరాడతానని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. బుధవారం సిద్దిపేట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 190 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు, సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకోవడం కోసం కొందరు శ్రేయోభిలాషులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తాను కేసీఆర్ ఆశీర్వాదంతో సిద్దిపేటను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత 9 నెలల కాలంలో అభివృద్ధి పథకాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ప్రత్యేకించి, సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు తరలించడాన్ని హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు.

ఇందుకు బదులుగా, కొత్తగా కాలేజీ నిర్మించుకోవాలని, సిద్దిపేటకు అన్యాయం చేయడం సమంజసం కాదని అన్నారు. కోమటి చెరువు వద్ద ఉన్న శిల్పారామం పనులు ఆగిపోయాయని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని హరీశ్ రావు అన్నారు. తన ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, అసెంబ్లీలో కూడా ఈ విషయంలో వెనుకడుగు వేయబోనని హామీ ఇచ్చారు.



## పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- భారీ వర్షా లకు దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించిన
- కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం లోని కల్వకోలు గ్రామంలో ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం పరిశీలించారు. కల్వకోలు గ్రామంలోని మహిళా రైతు సాకలి మణెమ్మ పంట పొలాలను పరిశీలించి వరి పంట సాగు చేసిన విస్తీర్ణం, వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో గ్రామస్తులతో కలిసి పరిశీలించాడు. వరి పంట పొలాల్లో తిరుగుతూ జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. ఎంతో వ్యయ ప్రయాసలు పడి వరి నాట్లు పూర్తి చేశామని, కానీ వర్షాలకు తీరం నష్టం జరిగిందని, తమను ఆదుకోవాలని రైతులు కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలంలో 455 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్టు వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలను ఎమ్మార్వోలు, వ్యవసాయ విస్తరణ అధికారులకు సేకరించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల 1280 మంది రైతులకు చెందిన 2465 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని, పంట నష్టపరిహారానికై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి శిరీష, ఏఈఓ ముజీబ్, రైతులు తదితరులు ఉన్నారు.



## మిడ్జిల్ పి హెచ్ సి మరియు కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

- రోగుల, విద్యార్థుల సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాలు
- వైద్య సేవలు, పాఠశాల పరిస్థితులపై ప్రత్యేక దృష్టి

**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం మిడ్జిల్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పి హెచి సి వైద్యాధికారిని ఆదేశించారు. ఆమె పి హెచ్ సి లో మందులు, అందిస్తున్న సేవలను పరిశీలించి, రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పీహెచ్ సి రెనోవేషన్ పనులు నిలిచిపోయిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని తనిఖీ చేసి, పాఠశాల వెనుక ఉన్న మురికి కాలువ, మిషన్ భగీరథ పైపులైను లీకేజీ సమస్యలను పరిష్కరించాలని తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థినిలతో కలసి భోజనం చేయడం ద్వారా వారి సమస్యలను దగ్గరగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా, మిడ్జిల్ తహసిల్దార్ రాజు, పి హెచి సి వైద్యాధికారి డాక్టర్ శివకాంత్, కేజీబీవీ ప్రిన్సిపల్ కవిత తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.





## చారిత్రక కట్టడాలకు నెలవు.. పానుగల్ ఖిల్లా

- సముద్ర తీరానికి 1800 అడుగుల ఎత్తులో కోట నిర్మాణం*
- ఖిల్లా దుర్గంపై పాదం మోపిన సీతా రాములు*
- వేసవిలో కూడా రామ గుండంలో పుష్కలంగా నీరు*
- చెక్కు చెదరని ప్రధాన ద్వారం, కట్టడాలు*
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు*



**వారధి న్యూస్, పానుగల్:** చారిత్రాత్మక కట్టడాలకు నిలయంగా పానుగల్ ఖిల్లా పేరుగాంచింది. తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా పానుగల్ మండల కేంద్రానికి సమీపాన ఉన్న ఈ ఖిల్లా కోట సైనిక స్థావరంగా, సీతా రాముల అరణ్యవాస స్థావరంగా ప్రసిద్ధి చెందింది. క్రీ.శ. 550 నుండి 1830 వరకు వివిధ రాజవంశాల పాలనలో ఈ కోట ఎన్నో జయాపజయాలను కళ్లారా చూసిన గమనించవచ్చు.

*సీతా రాములు పాదాలు మోపిన ఖిల్లా:* తండ్రి దశరథ మహారాజు ఆజ్ఞ మేరకు అరణ్యవాసానికి వెళ్లిన సీతారాములు 14 సంవత్సరాల పాటు ఈ ఖిల్లా దుర్గంపై నివసించినట్లు చరిత్ర చెబుతోంది. రామగుండం నేటికీ నీటిమట్టం తగ్గకపోవడం ఈ ప్రాంతానికి ప్రత్యేకతనిస్తుంది. సీతగుండం నుండి కృష్ణానది వరకు ఉన్న సొరంగ మార్గం నేటికీ ప్రజల్లో నమ్మకం కలిగిస్తుంది.

*ఖిల్లా దుర్గంపై శిలా శాసనాలు:* ఈ కోటలో తెలుగులో, ఉర్దూలో, కన్నడలో రాళ్లపై చెక్కిన శాసనాలు పలు చరిత్రక ఆధారాలు అందిస్తున్నాయి. బైరంఖాన్ మూడో శాసనం, చాళుక్యుల కాలంనాటి శిల్పాలు ఈ ఖిల్లా ప్రత్యేకతలను ఆవిష్కరిస్తున్నాయి. ఖిల్లా ముఖద్వారం ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలిచిన కట్టడంగా సందర్శకులను ఆకర్షిస్తోంది.

*ఖిల్లాలో బాల నాగమ్మ బంధీ:* ఈ ఖిల్లా దుర్గం బాలనాగమ్మ కథకు సంబంధిత ప్రదేశం అని నేటికీ ప్రజలు చెబుతుంటారు. ఇక్కడ నివసించిన మియా సాబ్, ఇక్కడి మక్కా మసీదు, బారాసాహిద్ దర్గా ఈ ప్రాంత చారిత్రక వైభవాన్ని మరింత ప్రత్యేకతనిస్తుంది.

*గుప్త నిధుల కోసం తవ్వకాలు:* ఈ ఖిల్లా దుర్గంలో దాచిన నిధులు కోసం దుండగులు తవ్వకాలు జరిపిన కారణంగా కొంత కట్టడాలు నేలకొరిగాయి.

*పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు:* పానుగల్ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. పునరుద్ధరణకు నివేదికలు సిద్ధమవ్వడంతోపాటు, రామగుండం వరకు సీసీ మెట్లు, మెటల్ రోడ్డు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు కూడా ఎస్టిమేషన్లు రూపొందించారు.







## వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

- కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- ఈ విపత్తుపై కేంద్రం తక్షణమే స్పందించాలి
- ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించాలి
- తక్షణ సాయం కింద నిధులు కేటాయించాలి
- విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు చేయడం సరికాదు: మంత్రి జూపల్లి కృష్ణారావు

**వారధి న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. మూడు రోజుల క్రితం కురిసిన అతి భారీ వర్షాలతో నాగర్ కర్నూల్ జిల్లా అతలాకుతలమై, ఆస్తి, పంట నష్టం జరిగిన నేపథ్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరధిలోని చౌట బెట్ల, నర్సింగరావుపల్లి, తాళ్ల నర్సింగాపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ముంపుబారిన పడ్డ పంట పొలాలు, కోతకు గురైన రోడ్లను, తెగిపోయిన బ్రిడ్జిలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను పరిశీంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన బాధిత రైతులను ఓదార్చారు. పశు నష్టం, పంట నష్టం ఇతర వాణిజ్య పంటల నష్టంపై ప్రత్యేక సర్వే నిర్వహించి పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చా రు. అధికారులు చేయాల్సిన పనులు త్వరగా పూర్తిచేయాలని, రోడ్ల మరమ్మతు పనులు తాతాలికంగా పూర్తి చే సి రవాణా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.., గతంలో ఎన్నడు చూడని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల్లో వరద బీభత్సం సృష్టించింది, ప్రాణనష్టం జరిగింది., పంట పోలాల్లో ఇసుక మేటలు వేసింది. ఇండ్లు దెబ్బతిన్నాయి. రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. కొన్నిచోట్ల బ్రిడ్జిలు సైతం కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరద నష్టాన్ని పరిశీలించి, బాధితులకు భరోసా కల్పించే పనిలో సీయం రేవంత్ రెడ్డి, మంత్రులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారన్నారు. ముంపు బాధితుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం, బాధితులకు రూ. 10 వేల తక్షణ సహాయం, దెబ్బతిన్న పంటలకు ప్రతి ఎకరానికి రూ.10 వేలు పరిహారం అందిస్తామని వెల్లడించారు. పంట నష్టంపై అధికారులు నివేదిక అందగానే పరిహారం అందజేస్తామని చెప్పారు. విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు.రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా అని, ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంతటి విపత్తుపై తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, ప్రదాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించి, సాయాన్ని ప్రకటించాలని కోరారు.

## మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చిన వనపర్తి జిల్లా కలెక్టర్

**వనపర్తి,★వారధి న్యూస్★:** పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. బుధవారం, కాలుష్య నియంత్రణ మండలి సహాయ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ డా. విద్యులత చేతుల మీదుగా గోడ పత్రికను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన గణపతి విగ్రహాలు నిమజ్జనం చేసిన తర్వాత నీటిలో త్వరగా కరగకపోవడంతో పాటు నీటి కాలుష్యాన్ని సృష్టిస్తాయని, ఇది పర్యావరణానికి హాని కలిగిస్తుందని తెలిపారు. అందువల్ల మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించడం సమాజానికి మేలు చేస్తుందని ఆయన అన్నారు.కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో 8 అంగుళాల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంచనున్నట్లు అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ డా. విద్యులత తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా సహకరించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.

## పార్ట్‌టైం అధ్యాపకుల తొలగింపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ

**మహబూబ్‌నగర్, వారధి న్యూస్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ గురుకులాలలో పని చేస్తున్న 6000 మంది పార్ట్‌టైం అధ్యాపకులను రాత్రికి రాత్రే తొలగించిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ, పార్ట్‌టైం ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పి, ప్రస్తుతం ఉన్న అధ్యాపకులను తొలగించడం వల్ల విద్యాసంవత్సరం మధ్యలో పాఠాలు ఎలా కొనసాగుతాయని ప్రశ్నించారు.ఇప్పటికే ఉన్న గురుకులాలు సమయం మార్పుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పుడు ప్రధాన సబ్జెక్టుల అధ్యాపకులను తొలగిస్తే పేద విద్యార్థులకు పాఠాలు ఎవరు చెబుతారు? విద్యాసంవత్సరం ప్రారంభమైన తర్వాత తీసుకున్న ఈ నిర్ణయాలు విద్యార్థుల చదువులను గందరగోళానికి గురిచేస్తున్నాయని ఆయన అన్నారు.అలుగు వర్షిని కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రశాంత్ విమర్శించారు. "ఆమె తీసుకున్న ఈ నిర్ణయాలు వల్ల కొన్ని గురుకులాల్లో ప్రిన్సిపాల్ తప్ప మరెవరూ లేరు. ఈ చర్యలు తక్షణమే నిలిపివేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు పిలుపునిస్తాం," అని ఆయన హెచ్చరించారు.



## రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- అన్నిదానాల కన్నా రక్త దానం గొప్పది
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్ నాగర్ కర్నూలు జిల్లా బ్యూరో:** రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవ ముగింపు సంబరాల సందర్భంగా జిల్లా ఫోటోగ్రాఫర్స్ మరియు వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం తరపున ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు.రక్తదానం చేసిన ఫోటో, వీడియో గ్రాఫర్లను జిల్లా కలెక్టర్ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆధునిక టెక్నాలజీతో రూపొందిన, అధునాతన ఫోటో మరియు వీడియో కెమెరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..... ఒక క్షణాన్ని మధురమైన జ్ఞాపకంగా తీర్చగలిగేది ఫోటోగ్రఫీ అని, ఎన్నో భావాలను ఒక చిత్రంలో తెలిపే గొప్పతనం ఒక ఫోటోగ్రఫీకి మాత్రమే ఉందని, అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫొటో నే అని కలెక్టర్ తెలిపారు. ఫోటోగ్రాఫర్లు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో ముందు వరుసలో ఉండాలన్నారు. సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉన్న ఫోటోగ్రాఫర్లు, ఈ వీడియో గ్రాఫర్, అందరు రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు.జిల్లాలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసే విధంగా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు అవగాహన కల్పించాలన్నారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. మనం ఆరోగ్యంగా ఉండాలని, ఇతరులకు రక్తదానం చేస్తామనే ధైర్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. అన్నిదానాల కన్నా రక్తదానం గొప్పదని చెప్పారు. రక్తం సరైన సమయంలో అందక పోవడం వల్ల ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారు. రక్త దానంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయని. రక్త దానం అనేది ప్రతీ ఒక్కరూ చేయాల్సిన సామాజిక బాధ్యత అని తెలిపారు, 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉన్న వ్యక్తులు అందరూ రక్తదానం చేయవచ్చని సూచించారు. రక్తదానం చేస్తే నీరసంగా ఉంటారనేది అపోహ మాత్రమేనని పేర్కొన్నారు. రక్తం పెరగాలంటే ఆకుకూరలు, బెల్లం, మొలకెత్తిన విత్తనాలు, క్యారెట్ ,బీట్రూట్, వేరుశెనగ తినాలని చెప్పారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఫోటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేతాజీ గౌడ్, వెంకట్, కేశవులు, గోవర్ధన్, విజయ్ గౌడ్, మల్లేష్, రాజు, కపిలవాయి రాజు, వెంకటేష్, నిర్మల దేవి, బూషిపాగ శ్రీను, వీరేందర్ గౌడ్, రెడ్ క్రాస్ కార్యదర్శి రమేష్ రెడ్డి, కుమార్, డాక్టర్ రోహిత్, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్లా ఖాన్, ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.



# వనపర్తి జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు మరింత కృషి

**డెంగ్యూ, మలేరియా కేసులను అరికట్టడానికి వైద్య, మున్సిపల్ శాఖలకు కలెక్టర్ ఆదేశాలు**
**–జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వారధి న్యూస్,వనపర్తి :** వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం సాయంత్రం సీజనల్ వ్యాధుల నియంత్రణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో, గతంతో పోలిస్తే ఈ సంవత్సరం మరింత గట్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నియంత్రణ కోసం రక్త నమూనాలు సేకరణ, ఎలిజా పరీక్షలు, పారిశుధ్య పనులు, డ్రై డే కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.పీర్లగుట్ట ప్రాంతంలో 10 డెంగ్యూ కేసులు నమోదు కావడంతో, రేపటి నుండి వారం రోజుల పాటు డ్రై డే కార్యక్రమం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. గర్భిణీల కోసం కొత్త ఈ.డి.డి రిజిస్టర్ ప్రోఫార్మను పకడ్బందీగా అమలు చేయాలని, ఎనీమియా నియంత్రణ కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మలేరియా అడిషనల్ డైరెక్టర్ డా. విజయ్ కుమార్, డిప్యూటీ డి.యం. అండ్ హెచ్.ఓ. బి. శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఎండి గఫార్ కుటుంబానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆర్థిక సాయం అందజేత

- **మరణించిన ఎండి గఫార్ కుటుంబానికి 5000 రూపాయల సహాయం: కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా**

**వారధి న్యూస్, వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా కేంద్రంలోని అరబ్ గల్లీ 17వ వార్డుకు చెందిన ఎండి గఫార్ అనారోగ్యంతో మరణించడంతో, వారి కుటుంబానికి వనపర్తి ఎమ్మెల్యే గౌరవ తూడి మేఘా రెడ్డి 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్ ద్వారా ఈ సాయం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్, ఇతర స్థానిక నాయకులు, ఎండి జహంగీర్, ఎండి మన్సూర్ అలీ, ఎండి అస్లాం, ఎండి బషీర్ తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.




# కోడెర్ మండలంలో మహిళలు, విద్యార్థినులకు షీ టీం అవగాహన సదస్సు

- **అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండి, భయపడవద్దని సూచన: ఎస్ఐ కోడేర్, షీ టీం ఇంచార్జ్ విజయలక్ష్మి**

**వారధి న్యూస్,కోడేరు :** నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కోడెర్ మండలంలో షీ టీం ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ మరియు మహాత్మా గాంధీ జ్యోతి బాపూ పూలే హాస్టల్ ఆవరణలో విద్యార్థినులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో షీ టీం ఇంచార్జ్ విజయలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు, బాలికలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. టీఎస్ఎఫ్అప్ గురించి వివరించి, ప్రయాణాల్లో ఆ యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. వేధింపులకు గురైనప్పుడు, షీ టీంను సంప్రదిస్తే, పిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు సోషల్ మీడియా వాడకం, సైబర్ క్రైమ్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోడెర్ ఎస్ఐ గోకరి, షీ టీం బృందం, వెంకటయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, భరోసా కోఆర్డినేటర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.








# ఏదుల రిజర్వాయర్ ను పరిశీలించిన మంత్రి జూపల్లి

**వారధి న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:**
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్ ను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. పనుల పురోగతి, పంపుల పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.








# లే ఔట్ లు అనుమతులకు కఠిన నిబంధనలు పాటించాల్సిందే: వనపర్తి జిల్లా కలెక్టర్

**వనపర్తి,వారధి న్యూస్:** వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం ప్రభుత్వ భూమి, చెరువు శిఖం, కాలువల పక్కన ఉన్న లే ఔట్ లను అనుమతించరాదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి లే ఔట్ కమిటీ సమావేశంలో టి.జి.బి.పాస్ ద్వారా వచ్చిన నాలుగు లే అవుట్ దరఖాస్తులను పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లే అవుట్ కోసం వెళ్లే అప్రోచ్ రోడ్డు, లే అవుట్ లోపల ఉన్న రోడ్లు ప్రభుత్వానికి గిఫ్ట్ డీడ్ ద్వారా ముందుగానే అందించాలనీ, అలాగే లే అవుట్ లో 10 శాతం స్థలాన్ని ప్రభుత్వానికి మార్టిగేజ్ చేసి, ప్రహరీ నిర్మించి, అందులో మొక్కలు పెంచాలని సూచించారు. లే అవుట్‌లో డ్రెయినేజీ, నిబంధనల మేరకు రోడ్లు, విద్యుత్, తాగు నీటి సౌకర్యాలు ఉండాలని సూచించారు.అదనపు కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, రోడ్లు భవనాలు, విద్యుత్ శాఖ అధికారులు కలిసి లే అవుట్ ప్రతిపాదనలు కమిటీ ముందుకు రాకముందే సైట్ ఇన్స్పెక్షన్ చేయాలని కలెక్టర్ సూచించారు. చెరువు శిఖం భూమి, బఫర్ ఏరియా, ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమిలో ఉంటే, అటువంటి లే ఔట్ దరఖాస్తులను ముందుగానే తిరస్కరించాలని చెప్పారు.ఈ సమావేశంలో నాలుగు లే ఔట్ లను కమిటీ పరిశీలించగా, ఒక డ్రాఫ్ట్ లే ఔట్ ను ఆమోదించగా, మరొక లే ఔట్ ను షరతులతో ఆమోదించారు. మిగతా రెండు లే అవుట్ లను వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం. నగేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీరు మల్లయ్య, ఇరిగేషన్ ఈ.ఈ. మధుసూదన్, రోడ్లు భవనాల డి.ఈ. సీతారామ స్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్, విద్యుత్ శాఖ ఈ.ఈ.లు, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలి

- **మట్టి గణపతే మహాగణపతి**
- **నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**వారధి న్యూస్ నాగర్ కర్నూలు జిల్లా బ్యూరో:** వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్టించి పూజించాలని తద్వారా చెరువులు, నీటి వనరులు కలుషితం కాకుండా చూడాలని, పర్యావరణాన్ని కాపాడాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు.బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర కార్యాలయం వారు రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన పర్యావరణ అనుకూల మరియు సహజ రంగులు ఉపయోగించి తయారు చేసిన మట్టి విగ్రహాలని పూజించాలి అన్నారు. మట్టి గణపతే మహాగణపతి అని తెలిపారు. ప్రజలకు పర్యావరణం పై అవగాహన కల్పించుట కొరకు గోడ పత్రికలను ఆవిష్కరణ చేయడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నజీమ్ అలీ అప్సర్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సజీనా మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు,



# వినాయక నిమజ్జన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలి

- **జోగులంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్**

**గద్వాల,వారధి న్యూస్ :** వినాయక చవితి వేడుకల సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని జోగులంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ బుధవారం అధికారులను ఆదేశించారు. ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాసులు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి ఈ ఏర్పాట్లపై చర్చించారు.కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం జిల్లాలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా కృషి చేయాలని సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు నది అగ్రహారం, జమ్మిచేడు, బీచుపల్లి, జూరాల డ్యామ్ ప్రాంతాల్లో నిర్వహించబడుతాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలు ప్రకారం, ఆర్.డి.ఓ. మరియు డి.ఎస్.పి.లు నోడ్‌ల పాయింట్లుగా వ్యవహరించాలనీ, మండల తాసిల్దార్లు మరియు పోలీస్ అధికారులు గణేష్ ఆర్గనైజర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిమజ్జనానికి రూట్ మ్యాప్ సిద్ధం చేసి, రోడ్ల మరమ్మతులు చేయాలని, నిమజ్జన ప్రదేశాల్లో సరైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.వైద్య సదుపాయాలు అందించేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. నదిలో ఈతగాళ్లను అందుబాటులో ఉంచి, వారికి ప్రత్యేక టీ షర్టు అందించాలనీ, పరిశుభ్రత, తాగు నీటి ఏర్పాట్లు, రోడ్డు మరమ్మత్తులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ మరియు మున్సిపల్ శాఖ అధికారులకు ఆదేశించారు. లైటింగ్, పవర్ జనరేటర్లు, బ్యారికేడింగ్ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, అదనపు ట్రాన్స్ఫర్మర్లు సిద్ధంగా ఉంచుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అగ్ని మాపక సిబ్బంది వినాయక ఉత్సవాలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక శాఖ అధికారులకు ఆదేశించారు.ఎక్సైజ్ అధికారులు, నిమజ్జన సమయంలో మద్యం షాపులను ముందుగానే మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని, నిమజ్జన ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలు మరియు కమాండ్ కంట్రోల్ బోర్డును ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. డి.జే.ల కోసం ఎలాంటి అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామ చందర్, డి.ఎస్.పి సత్య నారాయణ, ఏవో వీరభద్రప్ప, ఇతర సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో మమేకమై విద్యను బోధించాలి

- **జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మంతటి నారాయణ**

**వారధి న్యూస్ నాగర్ కర్నూలు జిల్లా బ్యూరో:** విద్యార్థులు ఏ దేశానికైనా భవిష్యత్తు మరియు వారు ముందుకు సాగడానికి ఒక విశ్వసనీయమైన గురువు అవసరం.అకాడమిక్ మరియు పాఠ్యేతర కార్యకలాపాలతో వారికి మార్గ నిర్దేశం చేసే ఉపాధ్యాయుడు అవసరం. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రేరేపించి జీవితంలో గొప్పతనాన్ని సాధించేందుకు వారిలోని ఉత్తమమైన వాటిని వెలికి తీస్తారు.విలువలు మరియు జ్ఞానాన్ని అందించడమే కాకుండా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆధునిక సవాళ్లు మరియు వాటినీ పరిష్కరించే పద్ధతుల ద్వారా మార్గ నిర్దేశం చేయాలి.ఏ విద్యార్థికైనా ఉపాధ్యాయుడు గుండెకాయ లాంటి వాడు.సబ్జెక్టులపై విపరీతమైన కమాండ్ ఉన్న వ్యక్తులు.ఉపాధ్యాయులు నిరంతరం చదివే పద్ధతులను ఉపయోగిస్తూ వారి జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. మంచి స్వరం మరియు అనుసరణకు అధిక గ్రహణశీలతతో ఉపాధ్యాయులు వివిధ పరిస్థితులలో సరళంగా ఉండాలి.మరియు ఉల్లాసమైన ముఖాలతో ఉపాధ్యాయ వృత్తిలో చేరుకోదగిన వ్యక్తిత్వాన్ని కలిగి ఉండాలి.పిల్లలు మంచి పౌరులుగా ఎదగడానికి సహాయం చేయడం ద్వారా ఉపాధ్యాయుడు ప్రపంచాన్ని మంచి ప్రదేశంగా మార్చగల వ్యక్తి ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు ఉన్నత స్థాయి సమగ్రతను కలిగి విద్యార్థులకు మంచి రోల్ మోడల్ గా ఉండాలి.అదేవిధంగా నిర్ణయాత్మక వైఖరి మరియు అందరితో స్నేహపూర్వకంగా ఉండాలి. సమర్థవంతమైన బోధనకు అద్భుతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరం.కాబట్టి ఉపాధ్యాయుడు బలమైన సంభాషణ కర్తగా ఉండాలి. ప్రభావంతమైన ఉపాధ్యాయుడు నిరంతరం అభివృద్ధి చెందుతున్న వాతావరణాన్ని మార్చడానికి అనువుగా ఉండి తమ బోధన వ్యూహాలను మరియు అభ్యసాలను ఎప్పటికప్పుడు మార్చుకోవాలి.కంప్యూటర్ల ద్వారా జ్ఞానానికి పూర్తి ప్రాప్తిని అందించడం డిజిటల్ టెక్నాలజీ యొక్క ఆకస్మిక ఆవిర్భవము అటువంటి క్లాసిక్ ఉదాహరణ ఉపాధ్యాయులు రెండో ఆలోచనలే లేకుండా మార్పులకు అలవాటు పడి తమను తాము అప్డేట్ చేసుకోవాలి. ఉపాధ్యాయుడు అద్భుతమైన తరగతి గదిలో ఉనికితో నిమగ్నమై అన్ని సమయాలలో సృజనాత్మక అభ్యస సెషన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఉపాధ్యాయుడు ఏ వయసులో ఉన్నప్పటికీ సహనాన్ని అలవర్చుకొని చాలా సవాల్ గా ఉన్న సమయాల్లో కూడా ప్రశాంతంగా మరియు కంపోజ్డ్ గా ఉండాలి. భారత దేశ భవిష్యత్తు తరగతి గదిలో పునః నిర్మాణం జరుగుతుంది, మన భారత దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి,విలువలు బోధించాలి నేర్చుకోవాలనే ప్రేమతో విద్య పట్ల అంకితభావం కలిగి ఉండి ముఖ్యమైన నైపుణ్యం,జ్ఞానాన్ని విస్తరించి విద్యార్థులకు అందించాలి. ఉపాధ్యాయుడు అకాడమిక్ సిలబస్ మాత్రమే బోధించకుండా విద్యార్థుల జీవితాలను మార్చే వ్యక్తి ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు పిల్లలకు విద్యా మరియు జ్ఞానాన్ని అందించే ప్రాథమిక వ్యక్తి. తల్లిదండ్రులతో పాటు వారు తమ జీవితమంతా జ్ఞానాన్ని బోధించడం ద్వారా ఉత్తమ మార్గదర్శకత్వాన్ని అందించాలి. ఉపాధ్యాయుడు ఇంటర్ ఆక్టివ్ ఆక్టివిటీలతో ఉపన్యాసాలను మరింతగా ఆనందదాయకంగా చేయడం ద్వారా విద్యార్థులు నేర్చుకోవడం మరింత సరదాగా మార్చాలి. ఉపాధ్యాయులు పిల్లలను ప్రోత్సహించాలి.మరియు కీప్ ఇట్ అప్ మంచి పని బాగా చేశారు మొదలైన పద బంధాలతో వారిని అభినందించాలి.తరగతి ప్రారంభంలో సస్పెన్షన్ను సృష్టించి ఇది మొత్తం సెషన్ లో విద్యార్థులను కట్టి పడేస్తుంది.పిల్లలకు ఎక్కువ కాలం ఆసక్తి ఉండేలా పాఠాలు బోధించాలి.

www.vaaradhinews.com

7
గురువారం,
05.09.2024

వారధి
తెలుగు దిన పత్రిక

GENERAL NEWS
జనరల్ న్యూస్



# బెజవాడ ఖాళీ.. ఇళ్లు వదిలి వెళ్తున్న జనం

- కట్టుబట్టలతో బంధువుల ఇళ్లకు పయనం
- వరద నీటిలోనే మరికొన్ని ప్రాంతాలు
- రోడ్లు, ఇళ్లలో పేరుకుపోయిన బురద
- సహాయక చర్యలు ముమ్మరం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- సీఎం చంద్రబాబు కీలక ప్రకటన





**వారధి, స్టేట్ బ్యూరో**

విజయవాడ.. ఇంకా వరద, బురదలోనే ఉంది. చాలా కాలనీల్లో వరద నీళ్లతో నరకం చూస్తున్నారు ప్రజలు. వరదలతో భారీగా ముంపునకు గురైన సింగ్‌నగర్ చుట్టుపక్కల ప్రజలు, ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో ఇళ్లను ఖాళీ చేసి బయటకు వస్తున్నారు. బెజవాడ ముంపు ప్రాంతాల నుంచి బయట ప్రాంతాలకు వేలాది మంది తరలివెళ్తున్నారు. నీటి ఉధృతి తగ్గటంతో కట్టుబట్టలతో ఇళ్లను వదిలిపెట్టి వెళ్లిపోతున్నారు. విద్యుత్ సరఫరా, తాగు నీరు, ఫుడ్ అందక ఇళ్లను వదిలి వెళ్తున్నట్టు బాధితులు చెబుతున్నారు. ఇళ్లలో ఉండే పరిస్థితులు అసలు లేవని వరద ప్రాంత బాధితులు చెప్తున్నారు. అలాగే, వాహనాలు దొరకని వందల మంది కాలి నడకన బంధువులు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్న దృశ్యం కనిపిస్తుంది. చిన్న పిల్లలకు పాలు లేక, తిండి లేక ఇబ్బందులు పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగ్ నగర్ నుంచి పాయకాపురం, కాంౘడ్రిక, వాంబే కాలనీ పరిసర ప్రాంతాల నుంచి ముంపు బాధితులు తరలి వెళ్తున్నారు.

కాగా, బుడమేరు వరద దెబ్బకు అజిత్ సింగ్ నగర్, కండ్రిక, పాయకాపురం, నున్న, వాంబే కాలనీ పరిసర ప్రాంతాల నుంచి ముంపు బాధితులు కట్టుబట్టలతో వెళ్తున్నారు. ట్రాక్టర్లు, బస్సులు, కాలి నడకన సైతం నగరం నుంచి వెళ్తున్నారు. 3 రోజులుగా నరకయాతన పడుతున్నామని బాధితులు ఆవేదన చెందుతున్నారు. జ్యోజీనగర్ ప్రాంతంలో ఇళ్లల్లో చేరిన నీరు బయటకి పోవడానికి మరో మూడు నాలుగు రోజులు పట్టే అవకాశం కనిపిస్తోంది.

**సహాయక చర్యలు ముమ్మరం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం విజయవాడలోని కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న రెస్క్యూ రిలీఫ్ ఆపరేషన్స్‌పై ఆరా తీశారు. యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు వేగంగా విద్యుత్‌ను పునరుద్ధరించాలని చంద్రబాబు నాయుడు అధికారులను కోరారు. ఎక్కడ ఎలాంటి అవసరమొచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బురద తొలగింపు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. 100 ఫైరింజన్లు, 2100 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నట్లు తెలిపారు. వైరల్ ఫీవర్ ప్రబలే ముప్పు ఉన్నందున ఆయా వార్డుల వారీగా వైద్య శిబిరంతోపాటు కరపత్రాల ద్వారా ప్రజలకు ఈ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టడంతో ఇంటింటికీ వెళ్లి సాయం చేసేందుకు అవకాశం ఉందన్నారు. నీరు, బిస్కెట్లు, పండ్లు, పాలు వంటి నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. కూరగాయలను తక్కువ ధరకు విక్రయించేందుకు మొబైల్ మార్కెట్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.











8
గురువారం,
05.09.2024
వారధి
తెలుగు దిన పత్రిక
www.vaaradhinews.com





# The GOATలో నన్ను నేను రిలేట్ చేసుకునే క్యారెక్టర్ చేశాను

దళపతి విజయ్, క్రియేటివ్ డైరెక్టర్ వెంకట్ ప్రభుల మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ The GOAT (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించింది. ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై లిమిటెడ్‌పై కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్ గణేష్, కల్పాతి ఎస్ సురేష్ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు వెర్షన్‌ను గ్రాండ్ గా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే సెన్సేషనల్ ప్రమోషనల్ కంటెంట్ తో నేషనల్ వైడ్ గా ఈ సినిమా హ్యుజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'The GOAT' సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మీనాక్షి చౌదరి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

విజయ్ గారితో వర్క్ చేయడం వండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్. విజయ్ గారు పాలిటిక్స్ కి ఎంటర్ అయ్యే ముందు చేసిన లాస్ట్ సినిమా ఇది. ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అమెజింగ్ ఎక్స్ పీరియన్స్. సినిమా రిలీజ్ కోసం చాలా ఎక్సయిటింగ్ గా ఎదురుచూస్తున్నాను. డైరెక్టర్ వెంకట్ ప్రభు గారు ఈ క్యారెక్టర్ కోసం అప్రోచ్ అయ్యారు. లుక్ టెస్ట్ చేసిన తర్వాత క్యారెక్టర్ కి పెర్ఫెక్ట్ అని సెలెక్ట్ చేశారు. నాది యంగ్ మోడరన్, కాలేజ్ గోయింగ్ గర్ల్ క్యారెక్టర్. వెరీ ఫన్ అండ్ లవింగ్ గా వుంటుంది. నా పర్శనల్ లైఫ్ లో కూడా రిలేటబుల్ క్యారెక్టర్ ఇది. ఈ సినిమాలో ప్రతి క్యారెక్టర్ కి ఒక లేయర్ వుంటుంది. కథలో నా క్యారెక్టర్ కి చాలా ఇంపార్టెన్స్ వుంటుంది.సినిమా చాలా ఎక్సయిటింగ్ గా వుంటుంది. ఈ ఇద్దరితో వర్క్ చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఇద్దరూ చాలా క్రమశిక్షణ గల హీరోస్. సెట్స్ లో అందరినీ సమానంగా గౌరవిస్తారు. వారితో వర్క్ చేయడం లైఫ్ టైం ఆపర్చ్యునిటీ. స్నేహ, లైలా లాంటి సినియర్స్ తో వర్క్ చేయడం గ్రేట్ లెర్నింగ్ ఎక్స్ పీరియన్స్. కెరీర్ బిగినింగ్ లోనే ఇలాంటి అవకాశం రావడం ఆనందంగా వుంది. అందరూ నన్ను చాలా కేర్ గా చూసుకున్నారు. వెంకట్ ప్రభు గారు కూల్ పర్శన్. చిల్ గా వుంటారు. ఆయన ఫిల్మ్ మేకింగ్ యూనిక్ గా వుంటుంది. చాలా సపోర్టివ్ గా వుంటారు. ఆయనతో వర్క్ చేయడం వెరీ న్యూ ఎక్స్ పీరియన్స్.



# 'దేవర' నుంచి థర్డ్ సాంగ్ రిలీజ్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం అనేక సంచలనాలను క్రియేట్ చేస్తోంది. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్ , యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్నఈ చిత్రంలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో అలరించబోతున్నారు. 'దేవర' సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'ఫియర్ సాంగ్..', 'చుట్టమల్లె..' సాంగ్స్ ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్‌ను రాబట్టుకోవటమే కాకుండా సినిమాపై ఉన్న అంచనాలను నెక్ట్స్ రేంజ్‌కు తీసుకెళ్లాయి. సంగీత దర్శకుడు అనిరుద్ రవిచందర్ సైతం ట్వీట్స్‌తో అంచనాలను పెంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం నుంచి 'దావుడి..' అనే వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఆడియెన్స్‌కు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మరోసారి ఈ పాటలో తారక్ డాన్స్ ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్‌తో అదరగొట్టేశారు. దీంతో ఈ పాట సినిమాపై అంచనాలను నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లింది. అనిరుద్ కంపోజ్ చేసిన ట్యూన్ ప్రతీ ఒక్కరినీ డాన్స్ చేసేలా చేస్తోది. ఇన్‌స్టెంట్ చార్ట్ బస్టర్‌గా నిలిచిన ఈ పాట మిగిలిన పాటలపై ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచేసింది. అనిరుద్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. పెప్పీ బీట్స్‌కు ఆయనెలాంటి సంగీతాన్ని అందిస్తారో అందరికీ తెలిసిందే. దేవరలో దావుడి సాంగ్‌ను వావ్ అనిపించేలా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి తెలుగులో రాసిన ఈ పాటను తమిళంలో విఘ్నేష్ శివన్, హిందీలో కౌసర్ మునీర్, కన్నడలో వరదరాజ్ చిక్‌బల్లాపుర, మలయాళంలో మాన్‌కొంబు గోపాలకృష్ణ రాశారు.